
# అబ్బా! పంచదార డబ్బా!!

సరసి

**ముప్పయ్యేళ్ల నాటి మాట. సోమసుందరం బాబయ్య కొడుకు పెళ్లికి తాడేపల్లిగూడెం దగ్గర ఓ చిన్న పల్లెటూరికి వెళ్లాం అందరం. మెయిన్ రోడ్డు నుంచి లోపలికి మట్టి రోడ్డు. బస్సులు వెళ్లవు. రెండెడ్ల బళ్లు ఏర్పాటు చేశారు ఆడపెళ్లివారు. ఆడపెళ్లివారు అనడమే గానీ, నిజానికి అంతకు ముందే వాళ్లతో మాకు బంధుత్వం ఉంది. గూడు కట్టిన ఆ బళ్లలో కూర్చుని వెడుతూ వుంటే రోడ్డు గతుకుల్లో అటూ ఇటూ ఊగుతూ ఒకళ్ల మీద ఒకళ్లుపడి, నవ్వుకోడాలూ, కిందకి జారిపోతూ వుంటే పట్టుకోడాలూ, కేరింతలూ అన్నీ ఇప్పటికీ బాగా జ్ఞాపకం.**

ఆ పెళ్లిలోనే ఓ మరిచిపోలేనీ సంఘటన. అది శుద్ధ పల్లెటూరు. పట్టుమని పాతిక కొంపలు చూడా వుండవు. ఉన్న పొలం అంతా అక్కడే వుండబట్టి పెళ్లికూతురు తండ్రి అక్కడే ఇల్లు కట్టుకుని వుండిపోయాడు. ఇల్లు అక్కడే వుండబట్టి అక్కడే పెళ్లి చేశాడు. వూళ్లో వాళ్లందరినీ పిలిచినా పెళ్లికి యాభై మంది కంటే లేరు, పిల్లాజెల్లా కలిపి. వాళ్ల కంటే మా మగపెళ్లి వాళ్లమే ఎక్కువ మందిమి ఉన్నాం.

అది మూడు రోజుల పెళ్లి. పుస్తి కట్టగానే చాలా మంది బంధు



వులు వెళ్లిపోయారు. ఆఖరి రోజు వరకూ ఉన్న పెళ్లి వారం పది మంది లోపే. రాత్రి పునస్సంధానం కాగానే తెల్లవారుఝామునే వెళ్లి పోతామని చెబితే రెండు గూడు బళ్లు ఏర్పాటు చేశారు. వాటిని రాత్రే సిద్ధం చేసి పెట్టారు.

వియ్యంకుడిగారిది పాత కాలం పెంకుటిల్లు. తాటి వాసాలు అక్కడక్కడ పుచ్చిపోయాయి. ఉన్నంతలోనే చక్కగా చేసి, వెల్లలు వేసి ఇంటిని అలంకరించారు. వంటిల్లు పక్కనే పందిరిపట్టె మంచం ఉన్న గదిలో వధూవరుల శోభనానికి ఏర్పాట్లయ్యాయి. వాళ్లిద్దర్నీ లోపలికి పంపించి, పెట్రోమాక్సు లైట్ల వెలుగులో చివరి బ్యాచ్ వాళ్లు అన్నాలు తిన్నాక, వసారాలో పడకలకు సిద్ధమయ్యాం.

నాకు మెళకువ వచ్చేసరికి, ఒక పక్క సీత పిన్ని, మరో పక్క వరాలమ్మ తారస్థాయిలో కబుర్లు చెప్పుకుంటూ చుట్టూ పడుకున్న వాళ్లని నిద్ర పోనివ్వకుండా చేస్తున్నారు. "చాల్చాలు, నిద్రపోడానికొచ్చారా? పాడు నిద్దర్లూ మీరూనూ. మళ్లీ అందరం ఎప్పటికి కలుస్తామో ఏమో, లేవండి" అంటూ అందర్నీ లేపి కూర్చోబెట్టి, కబుర్లలోకి దింపేరు. కబుర్లు, నేరాలు, ఘోరాలూ అలా నడుస్తూనే వున్నాయి, అవ్వడం అంటూ లేదు.

నేను లేచి టైము చూశా. మూడున్నరైంది. "ఇక చాలు గాని తెమలండి. పళ్లుతోముకుని కాస్తంత కాఫీ గొంతులో పోసుకుని బళ్లెక్కుదాం" అన్నాను. పెళ్లి వారు టూత్ పేస్టులు, పళ్లపొడి డబ్బాలతో బాటు కావలసిన వాళ్లకి కచ్చిక, తాటాకు నాలిక బద్దలూ కూడా సిద్ధం చేసి పెట్టారు.

అంతకు ముందే పళ్లు తోముకుని, కాఫీకి ఏర్పాట్లు చేస్తోంది పెళ్లికూతురు తల్లి మాలక్ష్మమ్మ గారు వంటింట్లో. ఆవిడేదో హడావుడి పడుతూ వుంటే, "ఏవిటి పిన్నిగారూ, వెదుకుతున్నారు" అనడిగేను నేను.

"పంచదారమ్మా. తెచ్చింది కాస్తా అయిపోయింది. రాత్రి చూసుకోలేదు" ఆందోళనగా. "లోపల పెద్ద డబ్బాలో చాలా వుంది. కాని అది వాళ్ల గదిలో ఉండిపోయింది" అంది మళ్లీ తనే. "అంటే... వాళ్లగదిలోనా" అడిగేను శోభనం గదివైపు చూపిస్తూ.

ఆమె అవునన్నట్లు తలాడించింది.


చచ్చేం! శోభనం గదిలో పంచదారుండిపోయిందా? మొహాలు కడుక్కున్న వాళ్లు ఒక్కొక్కళ్లూ చేరి, సమస్యని తెలుసుకుని నోళ్లు వెళ్లబెట్టారు. ఇప్పుడెలా మరీ? అందరూ తలో సలహా వొదిలారు.

"తలుపు కొట్టి, వాళ్లను లేపి తెచ్చుకోవచ్చు గానీ, శుభమా అని శోభనం చేసుకుంటున్న వారిని లేపొద్దమ్మా. ఈ ఒక్కపూటకీ పంచదార లేకుండా కాఫీ తాగేద్దాం, సరేనా?" అంది కాంతమ్మొదిన. "అమ్మ బాబోయ్ నావల్ల కాదు. కాఫీ అన్నా మానేస్తా గానీ, చేదు కాఫీయా? సారీ" అంది వకుళ. "పోనీ బెల్లం కాఫీ తాగుదామా?" అని ఒకళ్లంటే, "ఛీ, పానకంలా బెల్లం కాఫీ ఏమిటి?" అన్నారొకరు. "అయినా మనం మగ పెళ్లివారం. సర్దుకుపోవాల్సిన ఖర్మ మనకేం పట్టింది? ఎలాగోలా వాళ్లే ఎరేంజ్ చేస్తారు, మీరూరుకోండి." అంది సుబ్బులక్క. "నాకు కాఫీ పడందే నడవదమ్మాయ్. నాకే కాదు మీ బాబాయి క్కూడా. తెల్లారకుండా కాఫీ నోట్లో పడాల్సిందే. లేకపోతే గావు కేకలు పెట్టేస్తారు" అంది రత్నం.

మాలక్ష్మమ్మగారు కంగారు పడిపోతూ, కాస్తంత సన్నిహితంగా మెలుగుతున్నాననో ఏమో కడుపులో బాధ నాతో చెప్పుకుంది. "ఇన్ని చేశాం, ఇప్పుడు చివర్లో మాట దక్కించుకోలేకపోతున్నాం. ఆయన్ని పిలిచి చెప్పొచ్చు గానీ, ఆయన మాత్రం ఏం చేస్తారు? ఎవర్నన్నా వూళ్లోకి లాంతరిచ్చి పంపించినా వూళ్లో ఎక్కడా పంచదార దొరకదు. దుకాణం ఉంది గాని అక్కడ అమ్మరు. ఎవరింట్లోనన్నా చేబదులు తెచ్చేంత కాదిది. అందరూ తాగాలంటే కనీసం డబ్బాడు కావాలి. ఎక్కడ దొరుకుతుంది?"

"కిటికీలోంచి అబ్బాయికి వినబడకుండా మెల్లగా అమ్మాయిని ఈలేసి పిలుద్దాం, లేచొస్తుంది" అని ఎవరో సలహా ఇచ్చారు చీకట్లో. "ఛీ నోర్మూయ్" అని మరో గొంతు, ఆ గొంతును నొక్కేసింది.

"పిన్నోయ్, ఐడియా! మన కిష్టిగాణ్ణి లేపుదాం. వాడు బక్కపల్చగా వుంటాడుగా. అదిగో ఆ చూరులో పట్టేస్తాడు. మెల్లగా వాడిని లోపలికి దింపుదాం. చడీ చప్పుడు కాకుండా సంచీలో పోసుకొస్తాడు" అంది సీత పిన్ని.



"ఎందుకర్రా. ఓ పెద్ద గిన్నిని ఎత్తి పడేస్తే పోయే. ఆ చప్పుడుకి వాళ్లే లేచి, తలుపు తీస్తారు" అంది కామాక్షత్త. "చాల్లే. కొత్త దంపతుల్ని విడగొడితే, ఇదిగో చూశావుగా ఇప్పటికే పిల్లల్లేరు నీకు, వచ్చే జన్మలో కూడా పుట్టరు". అంది వరాలమ్మ. అది శాపంలా తగిలిందో ఏమో, "నన్ననడం కాదే, నీ బతుకు చూసుకో. పుట్టిన ఆ ఒక్క వెధవనీ గారం చేసి దద్దమ్మనీ చేశావ్. అంత కంటే నయం కాదిదీ?" అంది కామాక్షత్త. "ఆహా! మొగుడు చేత కాళ్లు పట్టించుకోడం కంటే నయమే" వరాలు రివర్సు గేరులో అంది. "చాలు చాలు ఆపండి. మీ గొంతులు విని అందరూ లేచేలా వున్నారు" అంటూ మిగిలిన వాళ్లు వాళ్లిద్దరికీ సర్ది చెప్పారు.

"మీ కెందుకూ, నేను పరిష్కారం చేస్తాగా" అంటూ, సీత పిన్ని కిష్టిగాణ్ణి లేపి తీసుకొచ్చింది. మాలక్ష్మమ్మ గారిని పంచదార డబ్బా గదిలో ఎక్కడుందో అడిగి తెలుసుకుంది. కిష్టిగాడికి చిలగడదుంపల బెల్లం పాకం అంటే ఇష్టం. తెల్లారేక ఆ వంటకం చేసిపెడతానని ఆశ పెట్టి, వాణ్ణి బ్రతిమలాడి, లోపలికెళ్లి, సైలెంట్‌గా పందిరిపట్టె మంచం కిందనున్న పెద్ద డబ్బాలో పంచదారని ఏ విధంగా సంచిలోకి వొంపి తేవాలో బోధించింది సీత పిన్ని.

అందరూ తలుపు దగ్గర చేరి, వాణ్ణి పైకెత్తి పట్టుకున్నారు. పైకి పాకుతూ ఆసరా కోసం తలుపు గడియ మీద కాలు వేశాడు వాడు. ఆ తాకిడికి తలుపులు భళ్లున్న తెరుచుకున్నాయి.

"అయ్యో, తలుపులు తెరిచే వున్నాయి. లోపల గడియ వేసుకోవడం మరిచిపోయినట్టున్నారు, మరీ అంత వొళ్లు తెలియకుండా... ఛీ..." అంటూ నోరు నొక్కుకుంది వరాలమ్మ. కొందరు 'పాపం' వస్తుందని కళ్లు మూసుకుని పక్కకి తప్పుకుంటే; ఒకళ్లిద్దరు కోరగా చీకట్లోకి తొంగి చూశారు, చూడకూడనిదేవన్నా కనిపిస్తుందన్న ఆశతో.

కిష్టిగాడికి తలుపెక్కాల్సిన అవసరం లేకపోయింది. మెల్లగా చీకట్లో వెళ్లి, ఏకంగా పంచదార డబ్బానే బయటకు తెచ్చేశాడు. వాడు బయటకు రాగానే చటుక్కున తలుపేసి బయట నించి గడియ పెట్టింది మాలక్ష్మమ్మ గారు. లోపలి వాళ్లు లేవకుండా పని కానిచ్చినందుకు ఊపిరి పీల్చుకుందామె.

తర్వాత, అప్పటికే సిద్ధం చేసుకున్న కాఫీని వేడి చేసి, పంచదార కలిపి, ఊదుకుంటూ, చప్పుళ్లు చేసుకుంటూ తాగేసి స్థిమిత పడ్డారంతా. "ఇక చాలు, లేచి బ్యాగ్‌లు సర్దండి. తెల్లారిపోతోందో ఏమో" అంటూ అందరూ ప్రయాణానికి సన్నాహాలు ప్రారంభించారు.

ఇంతలో "అమ్మా, ఆయనకి బెడ్ కాఫీ కావాల్ట. వేడిగా తెమ్మంటున్నారు" అంటూ కళ్లు నులుముకుంటూ పెళ్లికూతురు వీధి గుమ్మంలోంచి వచ్చింది లోపలికి. అంతా నోళ్లు వెళ్లబెట్టారు!

"ఇదేంటమ్మా! వీధిలోంచి వస్తున్నావ్? గదిలో పడుకోలేదా?"

"లేదమ్మా, ఇంట్లో ఎలకలు మీదకు దూకుతున్నాయి. అర్ధరాత్రి బయటకొచ్చి, వీధిలో గూడు బండిలో పడుకున్నాం." అంది పెళ్లి కూతురు, బద్ధకంగా.

"అదేవిటే చక్కటి పరుపూ, తలగడాలూ వదిలిపెట్టీ...?"

"బండిలో కూడా బాగానే వుందిలే. చక్కగా గడ్డి మీద చాపా అదీ, మెత్తగా..." అంటూ తుర్రున పారిపోయింది పెళ్లి కూతురు అక్కణ్ణించి.

★